
డాక్టర్ రంగశాయికి చాలా మొహమాటం. అంత చదువు వచ్చిందన్న మాటేకాని ఇంతా అంతా బిడియం కాదు. ఫారిన్ లో నాలుగేళ్ళు ఎలా వున్నాడో, ప్రొఫెసర్లతోటీ, సహాధ్యాయులతోటీ ఎట్లా మెసిలాడో, పిహెచ్. డి. యెలా సంపాదించాడో కాని, నలుగురిలో కలవలేడు. ఒక గంటసేపు సరదాగా మాట్లాకలేడు. అయినా మిన్నిసోటా యూనివర్శిటీలో ఆధునిక వ్యవసాయ శాస్త్రం సంబంధించి. భూసారమూ, అధికోత్పత్తి అన్న విషయంపై పరిశోధక వ్యాసం సమర్పించి డిగ్రీ తెచ్చుకున్నాడు. ఈ దేశం రాగానే బొంబాయి విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చింది.



# మనిషిలో మనిషి

మంజుశ్రీ

ఇంకా పెళ్ళిచేసుకోలేదు. తగిన వధువు కోసం సరే వోకంట కనిపెడుతూనే వున్నాడు. బొంబాయి ఆంధ్ర సంఘం వాళ్ళు, అభినందన సభ అన్నారు. ఖరగ్‌పూర్ ఆంధ్ర విజ్ఞానసమితివాళ్ళు సన్మానం అన్నారు. తీరికలేదు, నేను రాలేను, క్షమించండి అంటూ వివరంగా, మర్యాదగా, నొచ్చుకుంటూ రంగశాయి, ఉత్తరాలు వ్రాసిపడేశాడు. కాని అసలు రహస్యం ఆంతర్యంలో అతనికే తెలుసు. తనకు వల్లమాలిన బెరుకు, అక్కడపోయి నాలుగు నిముషాలైనా మాట్లాడకపోతే నవ్వులాట అయి పోతుంది. తనని పిలిచినవాళ్ళు ఆశాభంగం చెందుతారు. అభిమానంతో పిలిచినవాళ్ళను అపహాస్యంపాలు చేయటం అతనికిష్టంలేదు. అందుకే ఎక్కడకూ వెళ్ళలేదు.

అయితే ఒక సున్నితమైన సమస్యను తాను ఎదుర్కోనవలసి వుంటుందని అతడనుకోలేదు. అప్పుడు తప్పించుకొనటం ఎట్లా అని గూడా వెనక ముందాడలేదు. తాను చిన్నప్పుడు ఎక్కడైతే చదువు పూర్తిచేసుకున్నాడో, ఎక్కడైతే బి. ఎస్. సి. దాకా చదువుకున్నాడో, ఇవాల్టి తన అభ్యుదయానికంతా ఎక్కడ బీజాలు చల్లబడయో, ఆ ఊరినుండే ఆహ్వానం వచ్చింది. వేంకట్రాజుపురం, కళాశాల, ఆ చుట్టుపక్కల చాలా ప్రసిద్ధి. అసలు యూనివర్శిటీ కాలేజీల్లోనే ఎప్పుడూ ఆ కాలేజీ ఫస్టుగానీ, సెకండ్‌గానీ వస్తూవుంటుంది. అక్కడ బోధన బాగుంటుందనీ, క్రమశిక్షణ సక్రమంగా వుంటుందనీ, నలుగురూ అనుకోవటంలో అసత్యం ఏమీ లేదు. తాను ఆ కాలేజీలో చదువుకొనే బి. యస్ సి లో యూనివర్శిటీలో ఫస్ట్ వచ్చాడు. అక్కడ కాలేజీ ప్రిన్సిపాల్ గారు. ఇంకా తాను చదువుకొన్నరోజుల నాటి ఆయనే. ఆ య న గా రు. చాలా వాత్సల్యంతోనూ, ఎంతో మర్యాదనూ చూపుతూ వ్రాసిన ఉత్తరానికి ఏం సమాధానం చెప్పటమా అని, మల్లగుల్లాలు పడ్డాడు. నేను రాననో, రా లే న నో వ్రాయటం గురుధిక్కార నేరమే అనిపించింది. అదీకాక మనసంతా ఓసారి ఆ ప్రదేశాలను, చిరపరిచితమైన ఆ వాతావరణాన్ని, దర్శించాలన్న ఉత్కంఠతో వువ్విళ్ళూరింది. అన్నిటికన్న బలమైన ప్రేరణ ఇంకోటి వుంది. అది ఏమంటే తనకు బాల్యమిత్రుడూ, బి. యస్ సి,లో తనకు అతిసన్నిహిత సహపాఠి అయిన సత్యనారాయణ, ఆ కాలేజీలోనే లెక్చరర్ చేస్తున్నాడుట, ప్రిన్సిపాలుగారి ఆహ్వానంతోపాటుగా, ప్రాధేయపడుతూ, తప్పక రావలసిందని కోరుతూ 'పెర్శనల్ లెటర్' కూడా జోడించి పంపాడు. సత్యనారాయణంటే తనకు చాలా అభిమానం. చిన్నతనంలో తామిద్దరూ కలిసి పరీక్షరోజుల్లో, అర్ధరాత్రప్పుడు సినిమాహాలు ఎదురుగా, నాయర్ దుకాణంలో టీ తాగటం, జవజవ వణికిస్తున్న చలిలో రహస్యంగా సిగరెట్లూదటం. ఆ లెక్చరరిట్లా, యితడిట్లా అని కాలేజీ విషయాలు ముచ్చటించుకోవటం, అమ్మాయిలను గూర్చిన అల్లరికబుర్లూ, వాడి వీడి ప్రేమగాథలూ

సినిమా కథలూ, పత్రికలూ, శృంగారం పొలకబోయటం ఎలా మరచిపోతాడు. తెలిసీ తెలియని వయస్సది. అమాయక మైన ఉద్రేకాలన్నీ.

రంగిశాయి, ఓ రోజల్లా ఆలోచిం చినా తెగలేదు. అతడికయితే తప్పక వెళ్ళాలని వుంది. కాని వొకపక్క భయంకూడా పీడిస్తున్నది. కాలేజీ వార్షికోత్సవాల కోలాహలం, తాను ఎరగంది కాదు. చాలామంది వస్తారు. ఉత్సవాలకూ, ఉపన్యాసాలకూ, ఆటలు, పాటలు, నాటకాలూ, ఆ నాలుగు రోజులూ పరమోల్లాసకరంగా గడిచి పోతాయి. సరే ఒకనిర్ణయానికి గట్టిగా రాలేకపోయినా, మరీ అంత భయమైతే అనివార్య కారణాలవల్ల రాలేకపోయా నని, వైర్ ఇవ్వవచ్చునులెమ్మని. ప్రిన్సిపాల్‌గారి పేరిట, ఆ ఆహ్వానాన్నిఅందు కొని చాలా సంతోషించాననీ ఆ ఉత్స వాల్లో పాల్గొనటానికి తన మనసు తహ తహ లాడుతోందనీ కనుక తాను ఇరవై నాలుగు బయలుదేరి, ఇరవై ఆరు ఉద యానికి అక్కడకు చేరుకోగలననీ, వ్రాసిపడేశాడు. వ్రాసిపడేసిన దగ్గరనుంచీ ఏమిటేమిటో ఆలోచనలు, ఒకటి రెండు సార్లు తాను వేదిక ఎక్కి ఉపన్యాసం చెపుతున్నట్లూ, ఎవరో చప్పట్లుకొట్టి నవ్వుతున్నట్లు. ప్రిన్సిపాల్‌గారి ముఖం చిన్నపుచ్చుకుని, త్వరగా పూర్తిచెయ్యమని, తనవేపు చూసినట్లూ కలవచ్చి వులిక్కిపడి, పక్కమీద అటూ ఇటూ దొర్లి గ్లాసెడు మంచినీళ్ళు తాగాడు.

ఏమైనా తాను చదువుకున్న కాలేజీ పుట్టి పెరిగిన వూరూ, చిన్నప్పటి అనుభ

---

ఒకతను ఒక కిరాణాకొట్టు యజమానితో "ఏమండీ! మీ కొట్టులో అన్నీ కల్తీ సరుకులటగా" అని ప్రశ్నించాడు.

కొట్టుయజమాని అతన్ని పరీక్షగా చూసి, "కల్తీవల్ల మీకే లాభాలున్నాయండీ! ఉదాహరణకు చూడండి, మేం నూనెలో ఆముదం కలుపుతాము ఆముదం అజీర్ణాన్ని తొలిగిస్తుంది, బియ్యంలో తౌడు కలుపుతాము. తౌడు మనిషికి మంచి పుష్టినిస్తోంది, గోధుమ పిండిలో బియ్యపిండి, కొబ్బరినూనెలో మంచి నూనె మొ॥నవి మేం కల్తీ చేస్తాం. దానివల్ల లాభమంతా మీకే కదండీ ?" అని ఆ సామిని పొంగించి బేరానికి దించాడు కొట్టు యజమాని.

—వి. రామ్‌రెడ్డి.

వాలూ, ఉద్రేకాలూ, బలంగా రంగశాయిని, ప్రేరిపించాయి. వైరిచ్చి రాలేనంటే వాళ్లు మరీ బాధపడతారనీ తనకు తాను నచ్చచెప్పుకుని రంగశాయి వెంకట్రాజుపురం బయలుదేరాడు. అంతగా అయితే ఆధునిక వ్యవసాయ శాస్త్రాన్ని గూర్చి, జనరల్ గా ఏవో నాలుగు ముక్కలు మాట్లాడవచ్చునని తనకు తను ధైర్యం చెప్పుకున్నాడు.

స్టేషనులో రైలాగగానే సత్యనారాయణను చూసి చాలా సంతోషపడ్డాడు రంగశాయి. సత్యనారాయణ వస్తాడని తాను ఆశించాడు. కాని ప్రిన్సిపాల్ గారు కూడా కనపడటంతో ఆకాశమంత ఎతున వుబ్బొంగిపోయాడు. ఇంతలో ఎవరో కుర్రాడొచ్చి తనమెళ్ళో పూలమాల వేశాడు. తనేదో పరధ్యానంతో వుబ్బి తబ్బిబ్బై పోతూవుండగా ఆ పిల్లవాడు స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంటుట. రంగశాయి చాలా సిగ్గుపడ్డాడు ఆ ప్రెసిడెంటు చెప్పాడు. ఇట్లా ఫారిన్ వెళ్ళి డాక్టరేటు తెచ్చుకున్న కాలేజీ విద్యార్థులలో రంగశాయి ప్రథముడట. అందువల్లనే యీ అతిమాత్ర ఆదర సత్కారాలు.




"సాయంకాలమే నీ వుపన్యాసం. ఒక గంట ముందుగారా" అని ప్రిన్సిపాల్ తనను హెచ్చరించి, సత్యనారాయణతో ఆ విషయాలన్నీ నువు చూసుకోవోయ్. అని చెప్పిపోయారు ప్రిన్సిపాల్ గారు. సత్యనారాయణతో రంగశాయి, వాళ్ళింటికి బయలుదేరాడు. దారిలోనే సత్యనారాయణకుకూడా పెళ్ళికాలేదని తెలిసి అరెరే, నీకు పెళ్ళయి వుంటుందనీ, ఒకరిద్దరు చిన్నపిల్లలుకూడా వుంటారని, ఈ పూలమాల వాళ్ళకి వేసే కిలకిలలాడుతారని నేననుకుంటూవుంటే డిజప్పాయింట్ చేశావు సత్యం - అన్నాడు రంగశాయి.

సత్యనారాయణ నవ్వి వూరుకున్నాడు.

'ప్రేమకథా!'

"కాదులేవోయ్'

'లేక ఇంకేమన్నా కమామీషా'

చిన్నతనంలో ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడూ. అని సత్యనారాయణ ఎప్పుడూ పాడుతూ వుండేవాడు. రంగశాయి ఆ విషయం గుర్తు చేశాడు. తెలుగుసినిమా చూడక పాడై పోయాననుకో అన్నాడు రంగశాయి. 'బొంబాయిలో తెలుగు సినిమా కుంటే కొమ్మే' అన్నాడు.

సత్యనారాయణ అభినందించాడు. 'అరిసీ! రంగా నువు తెలుగు పూ... మరిచిపోలేదు. అదే నాకు కొండం... నంతగా వుంది. ప్రేమకోసమై పా... కూడా మరచిపోలేదే నాలుగేళ్ళ పా...

న్లో పున్నప్పటికీ నయండరీట తెలుగూ అనటంలేదు. అలాంటి ప్రబుద్ధులుకూడా కొందరున్నార్లే. తెలుగులో మాట్లాడ లేం మేము. తెలుగు సినిమాలు చెత్త, తెలుగు పుస్తకాలు అపహాస్యం, అంటూ మాట్లాడుతారు. వాళ్ళంటే నాకు మహ చెడ్డమంటోయ్. ఇంతకూ నువు మన మహాపురంమీదా. మా అందరిమీదా అభిమానం వుంచివచ్చావు. అదే పదివేలు మాకు. నిన్ను ఏనుగునెక్కించి ఊరేగించినా మాకు తృప్తివుండదోయ్! రంగశాయి సిగ్గుపడ్డాడు.

సత్యనారాయణ ఇంకా వొంటివాడే కావటంవలన ఇల్లు తీసుకోలేదు. చావలివారి వీధిలో విశాలమైనగది తీసుకున్నాడు. ఆ గది చాలా బాగుంది. ఆ వాతావరణమంతా రంగశాయికి చాలా నచ్చింది. 'మామ్మగారూ, రంగడొచ్చాడు అని కేకేశాడు సత్యనారాయణ. బంగారు ఛాయ, పండు తమలపాకుల్లాటి జారిపోయిన చెక్కిళ్ళు, అర్ధరూపాయంత నొసట కుంకుమ, కళ్ళల్లో కారుణ్యం, మొహమంతా పరమానందం మామ్మగారు, ఇంటికొచ్చిన అతిధిని గడపవతల విలుచుని, సిగు సిగ్గుగా, గారాంగా, మారాంగా, తండ్రిపిలుస్తుంటేసంకోచించే ఐదేళ్ళపిల్లలా గడప అవతలే నిలుచుని బాబూ వేడినీళ్ళున్నాయి. నాయన్ను పోసుకోమను. అన్నది సత్యనారాయణతో. రంగశాయి కళ్ళు ఆర్ద్రమైపోయాయి. తానెప్పుడో పదిహేనేళ్ళ క్రితం పోగొట్టుకున్న అమ్మ గుర్తు వచ్చింది. పోయి ఆమె పాదాలకు నమ


> గుమస్తా భార్య : మావారిది టెంపరరీ ఉద్యోగమండీ, ఏ నెలలో ఊస్టు చేస్తారో తెలియదు.
>
> కండక్టర్ భార్య : ఇంకా మీరదృష్టవంతులండీ! మా వారు ప్రొద్దున డ్యూటీకి వెళితే సాయంత్రం వఱకు ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో తెలియదు.
>
> —వి. రామ్‌రెడ్డి

స్కరించాలన్న ఉద్వేగం కలిగింది, 'బాబూ, ఇవాళ మీరిద్దరూ ఇక్కడే భోంచేదురుగాని, హోటలుకు పోవద్దు'అంటున్నది మామ్మగారు. "మామ్మగారూ, రేపు అలానే వింటాం మీమాట. ఇవాళ ఇంకో స్నేహితుడింటికి, వాడూ మా చిన్ననాటి స్నేహితుడే; ఇక్కడ బాంక్‌లో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. వాడింటికి రంగణ్ని తీసుకొస్తానని చెప్పాను. ఇందాక స్టేషన్‌నుండి మా స్నేహితుడు వచ్చాడని, కుర్రాణ్ణికూడా పంపాను. ఈపూట వెళ్ళకపోతే వాడు నొచ్చుకుంటాడు."

మామ్మగారు అసంతృప్తిగా, మూతి ముడిచింది. రంగశాయీ, సత్యనారాయణ కోటేశ్వర్రావింటికి వెళ్లారు. అక్కడ వొంటిగంటదాకా ఆ కబుర్లూ, యీ

కబుర్లూ చెప్పుకున్నారు. రంగశాయి అక్కడే రెస్టుతీసుకుంటానన్నాడు. సత్యనారాయణ నాలుగింటికివచ్చి తీసుకుని వెళతానని వెళ్ళాడు. కోటేశ్వరావుకి, కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్‌లో, సెలక్షన్‌వచ్చి, జూనియర్ ఆఫీసరుగా వేశారు ముందు. తరువాత ఇప్పుడిక్కడ ఏజెంటుగా వుంటున్నాడు. రంగశాయికి చాలా సంతోషం కలిగింది. చిన్న సంసారం సంతృప్తి వెల్లివిరుస్తోంది.

నాలుగింటికి సత్యనారాయణవచ్చాడు ముగ్గురూకలిసి కాలేజీకివెళ్ళారు. రంగశాయిగుండె లబ్‌డబ్‌మని వేగంగా కొట్టుకుంటూనే వుంది. తాను, ఏం మాట్లాడాలి? ఎంతమంది వస్తారో సభకు పెద్దలు చిన్నలు, ముందు ఏమని మాట్లాడాలి. కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలి. అని ఆలోచించుకుంటూ వున్నాడు. ప్రిన్సిపాల్ తనను సభకి పరిచయం చేశాడు. రంగశాయి కళాశాలకే గర్వకారణమనీ, అసలు యీ ఊరే రంగశాయిని చూచుకొని గర్వించవచ్చుననీ, యీ దేశానికే అతడు త్వరలో పేరు ప్రతిష్ఠలు తీసుకొనివస్తాడనీ, అతడు చదువుకునే రోజుల్లో పెద్దలయెడ యెంతో భయభక్తులు కలిగివుండేవాడనీ అప్పుడతణ్ణి ఎరిగినవాళ్ళు, భవిష్యత్తులో ఇతడు గొప్పదానిని దేనినో తప్పక సాధిస్తాడని అనుకున్నారనీ, యీ కళాశాలకే గాక, యీ ఊరికే అతడు మొట్టమొదటి పిహెచ్. డి. అనీ ఇత్యాదిగా, తనకున్న అభిమానాన్నీ, నెనరునూ, ప్రదర్శించాడు. రంగశాయి మాట్లాడటానికి ముందు మరోవక్త లలితకళలనుగూర్చి ప్రసంగించాడు. రంగశాయి సభనంత కలయజూశాడు. ఓ పక్కన చాలామంది ఆడవాళ్ళుకూడా వున్నారు. తమపిల్లలు బహుమతులు తీసుకుంటేనూ పాటలు పాడితేనూ, వేషాలువేస్తేనూ చూచి ఆనందించదామని, ఆ తల్లులంతా వచ్చారు. ఇక ఆ కాలేజీలో చదువుతున్న ఆడపిల్లలు బుజంమీద పైటకు బాడ్జొస్ గుచ్చుకుని, సీతాకోకచిలుకల్లా వయ్యారాలుపోతూ. అటూ ఇటూ తిరుగుతున్నారు. సభంతా కిటకిటలాడి పోతున్నారు. వేదిక ఎదురుగా కుర్చీల్లో వాళ్ళంతా పుర్రప్రముఖులై వుండవచ్చును. పెద్ద పెద్ద ఉద్యోగస్థులు, స్త్రీలు, అధికారులూ, కూచుని వున్నారు. రంగశాయివంతు వచ్చింది. లేచి మైకుముందు నిలుచోగానే తమ అభిమానాన్ని ప్రకటిస్తూ కుర్రాళ్ళు చప్పట్లు కొట్టారు. సంగ్రహంగా యీ కాలేజీకీ తనకూ గల అనుబంధాన్ని ముందు ప్రస్తావించి ఈ కాలేజీ తన తల్లివంటిదనీ, ఇవాళ యీ విధంగా కాలేజీకి రావటం తనకెంతో అదృష్టంగా భావిస్తున్నాననీ, తాను అనర్హుడైనా, ఇంతటి ప్రేమాభిమానాలు. కాలేజీ విద్యార్థులూ, ప్రిన్సిపాల్‌గారూ, పురజనులూ తనపట్ల చూపటం, తన పూర్వపుణ్యంగా భావిస్తున్నాననీ చెప్పాడు. ఇక అమెరికాలో తన అనుభవాలను కొంచెంగా ప్రస్తావించాడు. తన పరిశోధనలో తాను కనుక్కొన్న అంశాలలోకి ఉపక్రమించాడు. చాలా ఆవేశంగా మాట్లాడుతున్నాడు. అందరూ మంత్ర




ముగ్గుల్లా వినటంతో, చాలా ఆత్మవిశ్వాసమూ, కొండంత ధైర్యమూ కలిగాయి మానవుడుఎన్నెన్నో అద్భుతరహస్యాలు కనుగొంటున్నాడు. చంద్రమండలంలో తన బావుటాను ఎగరవేయబోతున్నాడు. ఈ శతాబ్దంలో శాస్త్రజ్ఞులు పరమాద్భుతాలైన అనేక విషయాలను కనిపెట్టారు. అట్లానే వ్యవసాయశాస్త్రంలో అద్భుతమైన పరిశోధనను జరిపారు. ఎన్నెన్నో ప్రయోగాలు చేశారు. ఒకప్పుడు పండినపంటకు ఇబ్బడిమబ్బడిగా పండించే శక్తిసామర్థ్యాలను కనుగొన్నారు. మేలుజాతి విత్తనాలను, అనేకపద్ధతులలో రూపొందించారు. గొడ్రాలు కెవరూ బిడ్డలను పుట్టించలేదు కాని, ఏ మాత్రం సారంవున్నా. ఆసారం అంతాపోయి చవిటిపర్ర అయినా, సశ్యశ్యామలంగా చేస్తున్నాడు. నోరుజారి ఆవేశంలో అవభ్యంగా మాట్లాడాడు.

అతడి మనస్సు చివుక్కుమంది. ఎదుట వరుసలో ఓ ముసలాయన, ఆయనకు డెబ్భైఏళ్ళపైనే వుండవచ్చును, గట్టిగా కాయపారు శరీరంతోవున్నాడుగాని. పగలబడినవ్వాడు. చప్పట్లుకొట్టాడు. ఊగిపోయాడు. రంగశాయికి చాలా దుఃఖం కలిగింది. అసహ్యమైంది. ఆ ముసలాయనవేపు చూస్తే ఆయనను తనను చాలా మెచ్చుకుంటాడు తలతాటుంచాడు. ఆడవాళ్ళవేపు చూడలేకపోయాడు రంగశాయి. తాను ఎంతదిగజారిపోయాడు. ప్రయత్నించి ఆడవాళ్ళవేపుచూస్తే వాళ్ళ వదనాల్లో నిర్లిప్తత ఉదాశీనవైఖరీ కన్పించాయి.

రంగసాయి ఉపన్యాసం ముగించబోతూ, ఇందాక తాను పొరపాటున అసభ్యమైన ఉపమానాన్ని ప్రయోగించాననీ, మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుకుంటున్నాననీ, ఇంత అసభ్యమైన ఉపమానంతన ప్రసంగంలో అనుకోకుండా వచ్చినందుకు, మనసులో చాలా నొచ్చుకుంటున్నాననీ. చాలా దీనంగా చెపుతున్నాడు. ఎదుటి వరసలో ముసలాయన. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ కేకవేశాడు. 'మరేం పరవాలేదు. వెల్ సెడ్. కేరీఆన్ ఆని" సిగ్గూ ఎగ్గూలేకుండా, చేతులూపాడు. ఆడవాళ్ళూ, పిల్లలూ, అందరూ ఆయనవేపు వింతగాచూసి, అసహ్యంతో తలలు ప్రక్కకు తిప్పుకున్నారు. ఆడపిల్లలకు కోపం వచ్చినట్లు విసురుగా తలలుతిప్పారు. రంగశాయి మళ్ళీ క్షమించమని అర్థించి, కూచున్నాడు.

> డైరక్టర్ హీరోతో: "నిన్ను ఇప్పుడు ఈ కొండమీద నుండి ఆ నదిలో పడేస్తారు. విలన్ అనుచరులు. నువ్వు ఈదుకొని ఒడ్డు చేరుకో!"
> హీరో: నాకు ఈతరాదండి!"
> డైరక్టర్: నీకు ఈత రాకపోయినా పరవాలేదు. యాక్షన్ చేస్తే చాలు."
>
> —సురేష్.

రంగశాయి కుర్చీలో కూర్చున్నాడే కాని తల ఎత్తలేకపోయాడు. ఉపన్యాసాలు ముగియటం అతడెరుగడు. వక్తలందరూలేచారు. యాంత్రికంగా అతడూ లేచాడు. ఎవరో కుర్రాళ్ళు ఆటోగ్రాఫ్‌ల కోసం, వచ్చారు. అదీ యాంత్రికంగానే నిర్వర్తించాడు. సృష్టిలో, ఒక భాగాన్ని పరమపవిత్రంగా చూచుకొనవలసిన స్త్రీ జాతిని తాను, అసభ్యంగా చిన్నపుచ్చాడు. ఇంతలో ఎవరో తనచేయిని బలవంతాన లాక్కొని పక్కగా నిలబడి అభినందిస్తున్నారు. 'చాలా వండర్‌ఫుల్‌గావుంది. మీ ఉపన్యాసం,' అంటుంటే, రంగశాయి పక్కకుతిరిగి చూశాడు. ఇందాకటి ముసలాయన, అడుగడుగు నెమ్మదిగా వేస్తూవచ్చి తనను అభినందిస్తున్నాడు. రంగశాయికి నిలువెల్లా అసహ్యం నిండింది. చాలా జుగుప్సకలగింది. ఆయన తనకు కనపడకుండా వుంటే ఎట్లానో మనస్సును చిక్కబట్టుకోగలిగేవాడు. మరచిపోవటానికి ప్రయత్నించేవాడు తానుపయోగించిన అసభ్యమైన వుపమానాన్ని. ముసలాయన అంతటితో వదిలిపెట్టలేదు. "ఇందాక మీరు ఉపయోగించి ఉపమానం. చాలా మార్వలెస్‌గావుంది. సరిగ్గా సందర్భానికి అతికినట్లు చెప్పారు" అన్నాడు, ఆయన తనను చాలా అవమానిస్తున్నట్లూ, దూషిస్తున్నట్లూ భావించుకున్నాడు రంగశాయి. ముసలాయన ఎలానో వదిలిపెట్టివెళ్ళాడు. ప్రిన్సిపాల్ గారు అభినందించారు. కుర్రాళ్ళంతా చుట్టూ మూగారు." ఏంఫరవాలేదు,

నువ్వు అనవసరంగా బాధపడిపోతు న్నావు. ఎవ్వరూ అబ్‌సీన్‌గా, తీసుకో లేదు నువ్వు సందర్భంగా వుపయోగిం చిన మాటలను నానా హంగామా చేశావు. భలేవాడివే "అన్నాడు సత్యనారాయణ కాఫీ టిఫిన్, తెప్పించి, రూమ్ లో ఏర్పాటుచేశారు. ఇంకాసేపటికి కూల్ డ్రింక్స్ తెప్పించి ఇచ్చాడు. అంతా బాగానేవుంది. సంతృప్తికరంగా జరిగి పోయింది. కాని తానామాటలు అన కుండా వుండవలసింది. గుర్తువచ్చినప్పు డల్లా ముల్లులా మనస్సులో కలుక్కు మంటున్నది. పాటలు, ఫ్యాన్సీడ్రెస్, నాటకాలూ, అన్నీ అతడికి సంతోషాన్నే కలుగజేశాయి. కాని మళ్ళీమళ్ళీ తన మాటలు గుర్తువచ్చాయి. ముగురాడ పిల్లలు జట్టుగావచ్చి ఆటోగ్రాఫ్ తీసు కున్నారు తనదగ్గర. వాళ్ళవేపు నిర్భ యంగా చూడలేకపోయాడు. వాళ్ళు తనను గూర్చి ఏమనుకుంటున్నారో, ఏమనుకుంటారో! చాలా సంకోచంగా వాళ్ళకు ప్రతి నమస్కారాలుచేశాడు.

సత్యనారాయణ రూముకు వెళ్ళేప్ప టికి చాలా పొద్దుపోయింది. తాను మాట్లాడినమాట తప్పుకాదా అని పదే పదేగుచ్చి గుచ్చి సత్యనారాయణను అడిగాడు రంగశాయి, భలేవాడివి, ఇంత మాత్రానికే నీవు బాధపడుతున్నావు. ఇక్కడ సభల్లో బూతులుకూడా మాట్లా డుతుంటారు. పెద్దపెద్ద ప్రొఫెసర్లూ, పండితులమని అనుకుంటున్నవాళ్ళూ శృంగారం పేరునా. కుర్రాళ్ళను నవ్వించేమిషతో చాలా అసభ్యంగా మాట్లాడ తారు. అందరూ సంతోషిస్తారు. సభలో అట్లా మాట్లాడటమే గొప్ప ఇప్పుడు. తెలుసు వాళ్ళు అన్నివిషయాల్లోనూ క్రూడ్‌గా వుండటానికే ఇష్టపడతారు. నువ్వు అమెరికాలో వుండి వచ్చావు కాబట్టి నీకు తెలీదు. అని నచ్చచెప్పాడు.

రంగశాయికి చాలా పొద్దుపోయిం. దాకా నిద్రపట్టలేదు. కాని దురదృష్టం, వెన్నంటివస్తూనేవుంది. ప్రొద్దున్నే ఆలస్యంగా నిద్రలేచి ముఖం కడుక్కొని బాత్‌రూంలోంచి బయటకొస్తుంటే పెరట్లో నిన్నతానసహ్యించుకున్న ముస లాయన, అభినందించాడు. ఈ ఇల్లు ఆయనదట. ఆయనింట్లోనే సత్యనారా యణవుంటున్నది. తాను ఉపన్యాసం కాగానే ఇంటికివచ్చేశాడు ఉపన్యాసం చాలా అద్భుతంగావుంది.

రంగశాయికి ఏడుపొచ్చినంతపనైంది 'ఈ శని ఎక్కడ దాపురించిందినాకు అని విసుక్కున్నాడు సత్యనారాయణతో. సత్యనారాయణచెప్పాడు. 'ఈనఇంట్లోనే తాను వుంటున్నది. పరమిలోభి వొట్టి మూర్ఖుడు. చిన్నతనాల్లో అన్నిరకాల వ్యసనాలూ వుండేవి. పేకాట, గుర్ర ప్పందాలు. వ్యభిచారం. పిల్లకనపడితే కట్టెపట్టుకుని వీధిచివరదాకా తరిమివ స్తాడు. పిల్లి బ్రాహ్మడు, పీటముత్తైదువు అని ఓ సామెతవుంది. అది యీనపట్ల నూరుపాళ్ళూ అన్వయిస్తుంది. అయితే చాలా ఆస్తివుంది. డబ్బూసంపాదించాడు కోర్టులవెంబడి తిరిగే, ప్రైవేట్ చేసే- నలుసుల్లేరు. చచ్చేప్పుడు ఇదంతా కట్టు కొనిపోతాడో ఏమో, ఇక యీన

4

ఇల్లాలు, శ్రీ మహాలక్ష్మి దొడ్డఇల్లాలు పొద్దున్నే లేచి ఆమె పేరు చెప్పుకుని, ఆమెను తలచుకొని నమస్కారంపెడితే, అన్ని పాపాలూ, పటాపంచలవుతాయి. ముసిలోడికి తెలీకుండా, పిల్లలకు వారాలిస్తుంది. అర్ధరూపాయీ, స్కూలుఫీజుల కిస్తుంది. పుస్తకాల కిస్తుంది. అవతలమనిషికి ఆకలవుతున్న దని ఎట్లా గ్రహిస్తుందోమరి, అవతల వ్యక్తి ఆకలి చూడలేదోయ్ రంగా అప్పుడప్పుడు ముసిలోడు, ఘర్షణపడుతూవుంటాడు. పెదవికదపదు. కాని తన మార్గమేతనది. ఈ వీధివాళ్ళంతా, పెద్దాచిన్నా. ఆమెను తల్లికన్నా మిన్నగా చూసుకుంటారు. ఒకరింట్లో అన్నం వండిపెట్టి వస్తుంది. ఇంకోరింట్లో పిల్లలకూ తల్లికి నీళ్ళుపోసి వస్తుంది. పిల్లలందరూ మామ్మా, మామ్మా అని సాయంత్రం అయ్యేసరికి వరండాలోనే వుంటారు. మహాతల్లి ఇవాళ మనం భోజనం చెయ్యకుండా. బ్రహ్మరుద్రాదులు వచ్చి చెప్పినావూరోక్కోదు. ముసిలాడు పదింటికల్లా అన్నం తిని, నల్లమందువేసుకుని పడుకుంటాడు. చదువుకున్నవాడే. తెలిసినవాడే అయినా ఏం లాభం, మూర్ఖుడు. ఇంకా చాపల్యాలు కొన్నివున్నాయి. వీధిలోపోయే ఆడవాళ్ళను కళ్ళుచికిలించి చూడటం పిచ్చిగా మాట్లాడటం లాంటి దుర్లక్షణాలు వున్నాయి.

రంగశాయికి కొంత ఓదార్పు కలిగింది. మధ్యాహ్నం మామ్మగారు తనను కన్నకొడుకుకన్నా మిన్నగా అదరించింది. రంగశాయి అమ్మను తలచుకొని ఎంతగానో దుఃఖపడ్డాడు. ఎంత దొడ్డయిల్లాలు ఈమెగారు. ముక్కూమొహం తెలీనివాణ్ణి, మళ్ళా ఈ జీవితంలో తాను చూడగలదో, లేదో నిర్ణయించలేనివాణ్ణి కూడా, కన్నకొడుకుకన్నా మిన్నగా ఆదరించింది.

మామ్మగారికి పదేపదే చెప్పాడు రంగశాయి, బయలుదేరుతూ. రైల్వేస్టేషన్‌లో సాగనంపటానికి వచ్చిన సత్యనారాయణకూ, కోటీశ్వర్రావుకూ కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. మామ్మగారిని మరిచిపోలేనని చెప్పమన్నాడు సత్యనారాయణతో.

రైల్లో కూచుని తన అనుభవాలన్నిటినీ నెమరువేసుకున్నాడు రంగశాయి. ముసలాయనకు పిల్లలేరు. అది ఆయన మనస్సుకొక అఘాతం. తను పొరపాటున. తొందరపాటున వ్యక్తంచేసిన ఉపమానం, ఆయన మనస్సుకి ఉపశాంతిని కలుగజేసింది. ఆ తప్పు తనది కాదని, ఆ లోపం తనవల్ల జరగలేదని ముసలాయన అభిమానానికి, వత్తాసు ఇచ్చాడు తాను.

ముసలోడంటే చాలా అసహ్యామే.

ఆ దొడ్డ ఇల్లాలునుతలచుకొని చాలా జాలిపడ్డాడు రంగశాయి. ★